

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**సరే,** మళ్ళీ ఆదివిష్ణుగారి జోలికి వస్తాను. ఆయనతో బాగా పరిచయం ముదిరిపోయాక– మరో మాయాబజార్, అమృతకలశం, పెళ్ళిళ్ళోయ్ పెళ్ళిళ్లు మొదలైన సినిమాలకు ఆయన సంభాషణలు రాస్తూ– నన్ను సహాయకునిగా తీసుకున్నారు. అపుడే 'తాతా మనవడు' సినిమా తీసిన నిర్మాత ప్రతాప్ ఆర్ట్స్ రాఘవగారు ఆదివిష్ణుగారిని పిలిచి 'ఈ ప్రశ్నకు బదులేది?" సినిమాకు సంభాషణలు రాయమన్నారు.

అయితే ఆయన ఆఫీసు పని వత్తిడులతో బిజీగా వున్న కారణంచేత రాఘవగారికి నన్ను పరిచయం చేసి "ఈయన

కూడా నా బాణీలోనే రాస్తడండీ" అంటూ అప్పగించారు. అలా ఆ సినిమాకు సంభాషణల రచయితగా సినీరంగానికి పరిచయం అయ్యాను. అయితే సినిమా రచయితగా నాకు మరో అవకాశం కూడా వచ్చినంత పనైంది. కానీ ప్రాప్తం లేకుండా పోయింది. అదెలా పోయిందో చెప్తాను. 1978 లో మదరాసులో వుండే ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ విజయ బాపినీడు గారు నన్ను మదరాసు రమ్మని ఆహ్వానించారు. అప్పటికే ఆయన "విజయ అనే మాసపత్రికను నడుపుతూండటం, ఆ పత్రికకు నేను అడపాదడపా కథలు రాస్తూండటం జరిగింది. ఆ పరిచయంతోనే నాకు అలా వారినుంచి పిలుపు వచ్చింది.

నేను హైదరాబాద్ నుంచి బయల్దేరి మదరాసు చేరుకున్నాను. నన్ను'రిసీవ్' చేసుకునేందుకు ప్రముఖ మేకప్ మాన్ శ్రీ మాధవరావుగారు వచ్చారు. నాతోబాటు వేరే రైళ్ళలో వచ్చిన శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం, శ్రీ రామాచంద్రమౌళి, శ్రీ ఎర్రంశెట్టిసాయి, శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిలను కూడా ఆయన రిసీవ్ చేసుకున్నారు.

మా అయిదుగుర్నీ ఆంధ్రా క్లబ్ కి తీసుకెళ్ళి అక్కడవున్న గెస్టహౌసుల్లో బస ఏర్పాటు చేశారు. ఆరోజు విశ్రాంతి తీసుకుని మర్నాడు శ్రీ మాధవరావుగారు మమ్మల్ని జెమినీ స్టూడియో (ఇప్పుడు అది లేదనుకుంటాను)కి తీసుకెళ్ళి అక్కడున్న విజయ బాపినీడు గార్కి పరిచయం చేశారు.

ఈ “ఓ వారం రోజులు మాతో గడిపి, మదరాసు మహానగరాన్ని సందర్శించి వెడతారని మిమ్మల్ని ఆహ్వానించాం!"అని చెప్పారు బాపినీడుగారు. అక్కడవున్న వారం రోజులూ, ఆ స్టూడియో గెస్ట్ హౌస్ లో, శ్రీ రాఘవేంద్రరావుగారు, శ్రీ మురళీమోహన్ గారు, శ్రీ మురారీగారు, శ్రీ పి. సాంబశివరావుగారు మొదలైన ప్రముఖ

నిర్మాతల్ని, దర్శకుల్నీ కూడా ఆహ్వానించి మాతో ఇంటరాక్ట్ చేయించారు. సాయంత్రంపూట బీచ్ కీ, విజయ వాహినీ స్టూడియోకీ,

చందమామ పత్రిక ఆఫీసుకీ తీసుకెళ్ళేవారు. అప్పట్లో శ్రీ బాపినీడుగారు, మురారిగారితో కలిసి 'జేగంటలు' అనే సినిమాని తీస్తున్నట్టుగా మాకు చెప్పి "ఆ సినిమా కథని వివరించి, చివరకు 'క్లైమాక్స్' ఎలా వుంటే బావుంటుందో ఆలోచించి చెప్పండి "అని అడిగారు.

ఆ మర్నాడు మాకు తోచిన' క్లైమాక్స్'ని మేం చేప్పాం! మా అందరి అభిప్రాయాలూ విన్న తర్వాత బాపినీడుగారు అసలు విషయం ప్రస్తావించారు.

“మీలో ఎవరైనా మీ ఉద్యోగాలకు ఆరునెలలు సెలవు పెట్టి ఇక్కడ మా గెస్ట్ లో వుండగలరా? మీకు మీ ఉద్యోగాల్లో వచ్చే జీతం నేనిస్తాను. భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తాను. ఈ ఆరునెలల్లోనూ ఒకటి రెండు సినిమాలకు కథలు కూర్చటంలోనూ, సంభాషణలు రాయటంలోనూ మాకు సహకరించాలి! "అన్నారు.

నాకైతే ఆ ఒప్పందం నచ్చింది. కానీ మిత్రులు సుముఖంగా లేరనిపించింది. ఒకటి రెండు సినిమాలకు పనిచేశాక మాకు'పర్మనెంట'గా అవకాశాలు వస్తాయని గ్యారంటీ లేదు కదా? అందుకే– ఎవ్వరం ఒప్పుకోలేదు. వారం రోజులూ వారి అతిథులుగా గడిపేసి తిరిగి వచ్చేశాం.

అదీ జరిగిన తర్వాత 1983 ప్రాంతంలో అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారు ఒకప్పుడు ఆయన నిర్మించిన ప్రేమలేఖలు చిత్రానికి పనిచేసిన ఆదివిష్ణుగారిని పిలిచి తాము ఒక చిత్రాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. అపుడు ఆదివిష్ణుగారు నన్ను కూడా తమవెంట తీసుకువెళ్ళి శ్రీ దుక్కిపాటి గారికి పరిచయం చేశారు. అంతే, నేను కూడా ఆయనకు 'జీడి'లా అతుక్కుపోయాను. వారానికి నాలుగైదుసార్లయినా నేనూ ఆదివిష్ణు కలిసి వారిని కలుస్తూ కథా చర్చలు కొనసాగించే వాళ్ళం. అప్పుడప్పుడు ఆయన మా ఇద్దర్నీ కథా చర్చల కోసం దేశంలోని ప్రధాన నగరాలకు, టూరిస్టు ప్రాంతాలకూ కారులో తీసుకువెళ్ళేవారు. ఒక్కొక్కసారి ఆదివిష్ణుకి తీరిక లేకపోతే నన్ను ఒక్కడినే తీసుకువెళ్ళేవారు. తరచుగా ఆదివారాల్లో మా ఇద్దర్నీ దుక్కిపాటిగారు సోమాజిగూడలో వున్న తమ ఇంటికి మధ్యాహ్నం పూట లంచ్ కి ఆహ్వానించేవారు.

అలా ఓ ఏడాది గడిచేసరికి మేం ఇద్దరం కలిసి సినిమా స్క్రిప్టు తయారుచేసి దుక్కిపాటిగారికి అందించాం! ఆ స్క్రిప్టును సినిమాగా రూపొందించే పనిలో పడ్డారు ఆయన మదరాసులో వున్న వారింటికి నన్ను కూడా తీసుకెళ్ళి పాటల రికార్డింగ్ సమయంలో ఆయనవెంట కూర్చోబెట్టుకునేవారు. ఆయన ఇంటి పక్కనే వున్న శ్రీ ఆత్రేయగారు వచ్చి అప్పట్లో రెండు పాటలు రాయటం, దానికి శ్రీ ఎస్ రాజేశ్వరరావుగారు. వచ్చి బాణీలు కట్టటం జరిగింది.

ఒకరోజున శ్రీ దుక్కిపాటిగారు 'బాపు' గార్ని కలిసి, మేం రాసిన స్క్రిప్టును ఆయనకు చూపించి “దీన్ని నిర్మించాలనుకుంటున్నాను. మీరు దర్శకత్వపు బాధ్యతల్ని చేపట్టాలి!" అని అడిగారు. అయితే ఆ కథలో క్రైమ్ ఎలిమెంటు వున్నదనీ– దాని బదులు వేరే ఏదైనా కుటుంబ కథా చిత్రాన్ని తీస్తే తాను దర్శకత్వం చేపడతానని చెప్పారు బాపుగారు.

దుక్కిపాటిగారికి ఏం చేయాలో తోచలేదు. అప్పుడు బాపుగారు "ముళ్ళపూడి రమణ గారి దగ్గర ఓ కథ వుంది. వినండి" అని సూచించారు. దుక్కిపాటిగారు ఆ కథ విన్నారు. ఆయనకి నచ్చింది. "దాన్నే తీద్దాం" అన్నారు శ్రీ దుక్కిపాటి. నేనూ ఆదివిష్ణు కలిసి తయారుచేసిన కథను పక్కన పెట్టి శ్రీ రమణగారు చెప్పిన కథను సినిమాగా తీశారు. అదే 'పెళ్ళీడు పిల్లలు' పాటలు బాగా వచ్చాయి. రమణగారి సంభాషణలు కూడా బాగున్నాయి.

అయితే అప్పటికి శంకరాభరణం చిత్రంలో' శంకరశాస్త్రి'పాత్ర ధరించిన శ్రీ జె.వి.సోమయాజులుగారు ఆ చిత్రంలో' నెగిటివ్ షేడ్స్'వున్న పాత్ర పోషించటంవల్లనో ఏమో ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. వదిలేయండి .. అయినా ఆయన నా స్నేహాన్ని మాత్రం వదిలిపెట్టలేదు. చాలాసార్లు నాకు సాయంత్ర సమయాల్లో ఫోన్ చేసి “ఖాళీగా వున్నారా రామచంద్రమూర్తిగారూ?" అని అడిగేవారు. నేను పనిలో కొంచెం బిజీగా వున్నా– 'పెద్దవారు కదా' అనే గౌరవంతో ‘ఖాళీగానే వున్నాను సార్ 'అని చెప్పేవాణ్ణి.

సరిగ్గా సాయంత్రం అయిదయ్యేసరికి తెల్లని అంబాసిడర్ కార్లో ఆయన రేడియో స్టేషన్ కి వచ్చేవారు.

అప్పటికే రెడీగా ఆయన కోసం ఎదురుచూస్తూ నిలబడి వుండే నన్ను కార్లో ఎక్కించుకుని ఆబిడ్స్ తాజ్ మహల్ హోటల్ కి తీసుకెళ్ళేవారు. ఆ హెటల్ పైభాగాన ఖాళీగా వుండే ఓ హాలులో మా కోసమే అన్నట్టు రెండు కుర్చీలు, ఒక టేబులు రెడీగా వుండేవి. ఓ అరగంట అక్కడ కూర్చుని కాఫీలు తాగి– కబుర్లు చెప్పుకుని బయల్దేరేవాళ్ళం. అలా బయల్దేరి తిన్నగా పబ్లిక్ గార్డెన్ కి వెళ్ళేవారం. ఓ చెట్టు కింద కూర్చుని గంటసేపైనా మళ్ళీ కబుర్లు. అన్నీ ఆయన నిర్మించిన సినిమాల తాలూకు కబుర్లే.

తిరిగి చీకటిపడే సమయానికి బయల్దేరి దారిలో 'అయోధ్య' హోటలు దగ్గరున్న పండ్ల మార్కెట్టులో ఆయన తమకు కావాల్సిన పళ్ళు కొనుక్కుని, ఆ చేత్తోనే నాకూ పళ్ళు కొనిచ్చి, తర్వాత నన్ను మా ఇంటిదగ్గర దింపి ఆయన తిరిగి వెళ్ళేవారు. దాదాపు ఆయన వయసూ మా నాన్నగారి వయసూ ఒక్కటే. అందుకే ఆయన్ని పితృ సమానంగా భావించేవాణ్ణి.

అలాగే రెండేళ్ళు గడిచిపోయాక–ఓసారి ఆయన అమెరికాలో వున్న వారి కుమారుని దగ్గరకు వెళ్ళి–తిరిగివస్తూ ఓ ఇంగ్లీషు నవల తీసుకొచ్చారు దాన్ని. నాకు ఇచ్చి –“దీన్ని చదివి సినిమా కథగా రాయండి"అన్నారు. నేను రెండు మూడు నెలలు కష్టపడి ఆ నవల చదివి, దాన్ని సినిమాగా రాసిచ్చాను. 'అమెరికా అబ్బాయి' అని పేరు పెట్టుకున్నాం.

శ్రీ సింగీతం శ్రీనివాసరావుగారిని దానికి దర్శకులుగా పెట్టుకుని నేను రాసిన ఆ కథకు నా మిత్రుడు శ్రీ ఆర్.వి.ఎస్ రామస్వామితో సంభాషణలు రాయించుకుని అమెరికాలో చిత్రీకరణ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఈ చిత్రంలో నటించటానికి రాజశేఖర్, చరణ్ రాజ్, రాధిక, అశ్విని, గుమ్మడి మొదలైన ప్రముఖ నటుల్ని ఎంపిక చేసుకుని, "మీరు కూడా ఆఫీసుకి సెలవు పెట్టి అమెరికా రాకూడదూ?" అని అడిగారు దుక్కిపాటిగారు. నాకూ వెళ్ళాలని అనిపించినా, అప్పట్లో పాస్పోర్టు కూడా లేనివాణ్ణి .. ఏం చేయను? వెళ్ళలేకపోయాను! మొత్తానికి సినిమా నిర్మాణం పూర్తయింది. ఈ చిత్రం కోసం డా ॥ సి. నారాయణరెడ్డిగారు రాసిన' ఏ దేశమేగినా ఎందుకాలిడినా 'అనే పాట బాగా ఆకట్టుకుంది. ఈ చిత్రం విడుదల సందర్భంగా ఏర్పాటైన ప్రెస్ మీట్ లో నేను మాట్లాడుతూ "శ్రీ దుక్కిపాటి గారికి నేను దత్తపుత్రుడులాంటివాణ్ణి!" అని సగర్వంగా చెప్పుకున్నాను. 'అమెరికా అబ్బాయి' చిత్రం ఘనవిజయం సాధించలేదు కానీ ఓ మోస్తరుగా ఆడింది. అయితే అమెరికాలో వుంటున్నవారి కుమారుడూ, అతని స్నేహితులు నిర్మాణానికి పెట్టుబడి పెట్టిన నేపథ్యంలో నష్టం రాలేదని శ్రీ దుక్కిపాటిగారే నాతో అన్నారు.

1988 లో ఓసారి ఆయన నాకోసం మా ఇంటికొచ్చారు. అప్పటికి మా పెద్దబ్బాయి విజయసారథి పెళ్ళి జరిగి పదిహేను రోజులైంది. ఆ పెళ్ళికి కూడా ఆయన హాజరై ఎంతో సమయం పెళ్ళి జరిగిన హాల్లోనే గడిపారనుకోండి! సరే మా ఇంటికి వచ్చిన దుక్కిపాటిగారు హాల్లో వున్న ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నారు. నేను మాట వరుసకు "ఈ హాల్లో ఓ సోఫాసెట్టు వేయిస్తాను సార్ .. మీరు హాయిగా కూర్చోవచ్చు!" అన్నాను నవ్వుతూ.

ఆయన వెంటనే "సోఫాసెట్టా? .. కొన్నారా?" అని అడిగారు.

"రెండుమూడు రోజుల్లో కొనాలి సార్!" అని

చెప్పాను. "అయితే రేప్పొద్దున మాఇంటికి రండి. నా దగ్గర ఓ సోఫాసెట్టుంది మీకు నచ్చితే దాన్ని తీసుకోవచ్చు!" అన్నారు. నాకు కొంచెం సిగ్గేసింది. అయినా "వస్తాను సార్" అన్నాను. మర్నాడు పొద్దున్నే ఆయనే కారు పంపించారు. నేను వారింటికి వెళ్ళాను. నన్ను వారింటి వెనుక భాగాన వున్న ఓ షెడ్డు దగ్గరకు తీసుకెళ్ళారు. వారి నౌకర్ని పిలిచి షెడ్డు తలుపు తీయించారు. అందులో వున్న సోఫాసెట్టును చూపించారు. ఓ పెద్ద సోఫా రెండు చిన్న సోఫాలూ! చాలా పెద్దవిగా వున్నాయి. ఇవి మెట్రోలో 1954 లో కొన్నాను. నల్లవిరుగుడు చావ .. స్పెన్సర్ వుడ్! దొంగరాముడు సినిమా సెట్లో వేయటానికి తీసుకున్నాను. తర్వాత తోడికోడళ్ళు సినిమాలో కూడా వాడాం! ఆ తర్వాత నేను హైదరాబాద్ కి మకాం మార్చేసినప్పుడు వీటిని తీసుకొచ్చి ఇలా షెడ్డులో పెట్టేశాం! బావుంటాయనుకొంటే మీరు తీసుకోవచ్చు! "అన్నారు.

బాగాలేవని ఎలా చెప్పగలను? నిజంగా చాలా బావున్నాయి. సోఫాలో కూర్చునే సీట్లు, వెనక జారగిలబడే కుషన్లు– తలగడల మాదిరిగా కనిపించాయి.

“బావున్నాయి సార్! నేను తీసుకుంటాను. రేపో ఎల్లుండో ఓ వ్యాను తీసుకొచ్చి అందులో తీసుకెడతాను"అని చెప్పాను.

ఆ మర్నాటి ఉదయం ఎనిమిది గంటలవేళ– ఆయన కారు డ్రైవరు మా ఇంటికొచ్చి తలుపు తట్టాడు. నేను తలుపు తీసి చూశాను.

ఎదురుగా నిలబడి వున్న ఆ డ్రైవరు “అయ్యగారు సోఫా పంపించారు సార్"అన్నాడు. నేను ఆశ్చర్యానికి గురయ్యాను. బయటకు వచ్చి చూసేసరికి ఆ కారు డిక్కీలో ఓ సింగిల్ సోఫా కనిపించింది. నెమ్మదిగా దాన్ని ఇంట్లోకి చేర్చాం.

" నేను వచ్చి తీసుకుంటానన్నాను కదయ్యా? నీతో ఎందుకు పంపారూ? "అని అడిగాను డ్రైవర్ని

“ ఏమో సారి! ఖాళీగానే వున్నాను కదా అని ఇచ్చి రమ్మన్నారు. తక్కిన రెండు సోఫాలు కూడా తెచ్చిస్తాను” అంటూ వెళ్ళిపోయాడు. మరో రెండు గంటల్లో ఆ రెండు సోఫాలు కూడా మా ఇంటికి చేరిపోయాయి.

ఇప్పుడు చెప్పండి ఆయనకు నేను దత్తపుత్రుడులాంటివాణ్ణి ఔనా– కాదా?

ఇప్పటికీ ఆయనపట్ల కృతజ్ఞత కొద్దీ ఆ సోఫాసెట్టునే నేను వాడుతున్నాను. రెండేళ్ళకి మూడేళ్ళకీ వాటికి రంగు వేయించి అందులోని దిండులను మారుస్తున్నానే తప్ప సోఫాసెట్టును మాత్రం మార్చలేదు. నేను జీవించినంతకాలం వాటిని మార్చాలని ఆసుకోవటం లేదు!

శ్రీ దుక్కిపాటిగారు తీసిన' అమెరికా అబ్బాయి'కి కథ రాయటంతో నా సినిమా రంగపు అనుబంధం దాదాపు ఆగిపోయినా దూరదర్శతో నా ప్రస్థానం మాత్రం ఊపందుకుంది.

అప్పట్లో దూరదర్శన్ కేంద్రం పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఉపగ్రహ దూరదర్శన్ పేరుతో సోమాజిగూడలో ఏర్పాటైన ఆ కేంద్రంలో కార్యక్రమాల్ని రికార్డు చేసి గుల్బర్గా పంపించి, అక్కడినుంచి ప్రసారం చేసేవారు. అదే సమయంలో రేడియోలో పనిచేసి దూరదర్శన్ లో చేరిన నా మిత్రులు నాచేత కార్యక్రమాలు రూపకల్పన చేయించేవారు.

శ్రీమతి రమణీ సన్యాల్ అనే రేడియో డ్యూటీ ఆఫీసరు, ఉపగ్రహ దూరదర్శన్ కేంద్రానికి ప్రొడ్యూసర్ గా వెళ్ళి అప్పటికే రేడియో ద్వారా బహుళ ప్రజాదరణ పొందిన కార్మికుల కార్యక్రమాన్ని దూరదర్శన్ ద్వారా కూడా ప్రసారం చేయించారు. (నాలుగైదు వారాలనుకుంటాను)

నేను రేడియోలో చేరిన కొత్తలో, మా వద్ద 'క్యాజువల్ ప్రొడక్షన్ ఆసిస్టెంట్'గా పనిచేసిన శ్రీ ఎమ్వీపీ శశిధర్ కూడా 1974 లోనో 1975 లోనో దూరదర్శన్ కేంద్రంలో స్క్రిప్టు రైటర్ గా చేరారు. నేను అప్పటికే రేడియో నాటకాలు రాయటంలో కొద్దీ గొప్పో పేరు తెచ్చుకున్నాను గనుక నన్ను ఓ టెలీఫిల్మ్ కి కథ, మాటలూ రాయమని అడిగారు.

"సమాజం! నీ దారి ఇటు" పేరుతో టెలీ ఫిల్మ్ రాసిచ్చాను దానికి. స్క్రీన్ ప్లే శశిధర్ ముందుగా తయారుచేసి ఇచ్చారు. శ్రీయుతులు జె సిద్ధప్పనాయుడు, డి.బి.రావు, ఎర్రనేని చంద్రమౌళి, శ్రీమతులు మల్లాది విజయలక్ష్మి, భావన మొదలైన తారాగణాన్ని ఎంపిక చేసుకుని దూరదర్శన్ కేంద్రంలోనే ఎడిటర్ గా పనిచేస్తున్న శ్రీ జి.కె. మూర్తి ఆ చిత్రానికి దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టి చిత్రాన్ని నిర్మించారు. గంట వ్యవధిగల ఆ చిత్రం అప్పటి దూరదర్శన్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

ఆ తర్వాత 1977 లో ఉపగ్రహ దూరదర్శన్ కేంద్రం పూర్తిస్థాయి కేంద్రంగా రూపొందింది. అప్పటి రాష్ట్రపతి డా ॥ నీలం సంజీవరెడ్డిగారు ఈ కేంద్రానికి స్థానిక రవీంద్రభారతిలో లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు. ఆ ఉత్సవం తాలూకు విశేషాలను రేడియో కోసం నేను రికార్డు చేయగా' రేడియో నివేదికగా ఆకాశవాణి కేంద్రంనించి ప్రసారం అయింది.

దూరదర్శన్ కేంద్రం కూడా తన లోగిలిలో నాకు కాస్తంత చోటు ఇచ్చింది. అదెలాగో వివరిస్తాను. ఇంతకుముందు నాకు మిత్రులుగా లభించిన ఇద్దరిలో ఒకరు ఆదివిష్ణుగారైతే, రెండవవారు సి జయదేవరెడ్డిగారని. చెప్పాను. గుర్తుందికదా! 1983 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక, ఏర్పాటయిన ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ లో శ్రీరెడ్డిగారు డైరెక్టర్ గా వుండేవారు. ఆకాశవాణిలో రచయితగా రవ్వంత పేరు తెచ్చుకుని, అప్పటికే ఉపగ్రహ దూరదర్శన్ కేంద్రానికి టెలీఫిలిం వగైరాలు కూడా రాసివున్న నన్ను పిలిచి శ్రీ రెడ్డిగారు తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించీ ప్రవేశపెడుతున్న కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేసే విధంగా నాచేత ఎన్నో డాక్యుమెంటరీ చిత్రాలు తయారు చేయించారు. వాటిని దూరదర్శన్ కేంద్రం ప్రసారం చేసేది. కొన్నాళ్ళ తర్వాత శ్రీ రెడ్డిగారు తమ పదవికి రాజీనామా ఇచ్చి సోమాజిగూడలో స్వంతంగా 'తరంగిణి' అనే పేరుతో ఓ స్టూడియో నెలకొల్పుకున్నారు. అప్పట్లోనే సీరియల్స్ ప్రసారం చేయటం ప్రారంభించింది దూరదర్శన్ కేంద్రం. రెడ్డిగారు వెళ్ళిపోయాక ఎఫ్.డి.సి.కి డైరెక్టర్ గా వచ్చిన శ్రీ ముంజులూరి భీమేశ్వరరావు గారు నన్ను ఒదిలిపెట్టలేదు. ఆయన కూడా నాతో చాలా డాక్యుమెంటరీలకు రచన చేయించారు. అంతేకాకుండా 'సుప్రభాతం' అనే సీరియలను నిర్మిస్తూ-దానికి సంబంధించి తొమ్మిది భాగాలకు నాతో సంభాషణలు రాయించారు. ఆ సీరియల్ లో శ్రీయుతులు మురళీమోహన్, రావి కొండలరావు, శ్రీమతులు కాంచన, రాధాకుమారి వంటి ప్రముఖ సినీనటులు నటించి రక్తి కట్టించారు.

ఆ తర్వాత శ్రీ రెడ్డిగారు నాచేత 'శ్రేయోభిలాషి' పేరుతో 90 నిమిషాల వ్యవధికి ఓ టెలీఫిలిం రాయించుకుని, దాని ప్రసారానికి ఢిల్లీ అధికారులనుంచి పర్మిషన్ తెచ్చుకుని నిర్మాణం ప్రారంభించారు. రాజా ప్రధాన పాత్రధారిగా నటించిన ఆ చిత్రంలో నేను కూడా మేస్టారి పాత్ర పోషించాను. శ్రీ కె.ఎస్ రామిరెడ్డి. దర్శకత్వం వహించారు.

అప్పట్లోనే శ్రీ చోటా కె.నాయుడు, వారి శ్రీమతి సీతాదేవి కలిసి దూరదర్శన్ కోసం 'మర్యాద రామన్న' ధారావాహికను నిర్మించి ప్రసారం చేస్తున్నారు. వారే ప్రముఖ కథా రచయితల కథలు పదమూడింటిని తీసుకుని వాటిని కూడా చిత్రాలుగా తీయాలని తీర్మానించుకుని, "సంభాషణలు బాగా రాయగలిగి సినిమా క్రాఫ్ట్ తెలిసిన రచయిత ఎవరైనా వుంటే చెప్పండీ"–అని రెడ్డిగార్ని అడిగారు. వెంటనే ఆయన నా పేరు చెప్పారు.

శ్రీమతి సీతాదేవి గారి నుంచి నాకు 'అర్జంటుగా రమ్మని కబురొచ్చింది. నేను వెళ్ళాను. విషయమంతా చెప్పి ప్రముఖ కథారచయితలైన శ్రీయుతులు గురజాడ, బాలగంగాధర తిలక్, మల్లాది రామకృష్ణశాస్త్రి, బుచ్చిబాబు, పాలంకి వెంకట రామచంద్రమూర్తి, రావూరి భరద్వాజ మొదలైన పదముగ్గురు రచించిన కథల్ని నాకు ఇచ్చి టెలీ ప్లే, సంభాషణలు రాయమన్నారు.

నేను ఒక్కొక్కటే రాసివ్వటం, వారు దాన్ని చిత్రంగా నిర్మించి ఆణిముత్యాలు పేరుతో దూరదర్శన్ లో ప్రసారం చేయటం జరిగింది. ఆ చిత్రాల్లో శ్రీయుతులు గుమ్మడి, రాళ్ళపల్లి, మహర్షి రాఘవ, శ్రీమతులు కిన్నెర, బెంగుళూరు పద్మ వంటి ప్రముఖ సినీనటులు ఎందరో నటించారు. సదరు' ఆణిముత్యాలు' శీర్షికన ఆ చిత్రాలు మొన్నమొన్నటివరకూ దూరదర్శన్ కేంద్రం కనీసం పదిహేనుసార్లయినా పునః ప్రసారం చేసింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments